క్లుప్తంగా

రేపు పల్లమాలలో కోటి సంతకాల సేకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలల్లో 10 కళాశాలలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొణతనేని మణినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పల్లమాల గ్రామంలో కోటి సంతకాల సేకరణను, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనికి తిరుపతి ఎంపీ మద్దిలగురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

నీటి తొట్టెల్లో మురుగునీరు



వరదయ్యపాళెం: పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు కాస్త మురుగునీటి తొట్టెలుగా మారాయి. తొట్టెల్లో వర్షాలకు చేరిన నీటి నిల్వలు అలాగే ఉండిపోవడంతో అది మురుగునీరుగా మారిపోయింది. నిల్వ చేరిన నీటిలో నుంచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంతేకాక ఆ నీటి నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ పరిస్థితి మండలంలోని బత్తలవల్లం గ్రామ సచివాలయానికి ఆనుకుని ఉండడం గమనార్హం. మురుగునీటిమయంగా మారిన నీటి తొట్టి నుంచి ఆ నీటిని శుభ్రం చేసే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి నిర్మాణం చేసిన పశువుల దాహార్తిని తీర్చే నీటి తొట్టెల నిర్వహణ బాధ్యత ఎవరిదో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లక్ష్యం నీరుగారడమే కాకుండా అదనంగా ఈ తొట్టెలోని మురుగునీటి నిల్వల కారణంగా స్థానికులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. తెలంగాణ ఎంపీలు ఈటల రాజేందర్, బలరాం, ఎమ్మెల్యే రామచందర్‌నాయక్, ఆంధ్రకు చెందిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపికను అందజేశారు.

కవితకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం లభించింది. శ్రీకాళహస్తికి రాగానే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారి దర్శనానికి వెళ్లారు.

నాగలాపురం: టీపీకోట మార్గంలో సదాశివశంకరాపురం వద్ద రోడ్డు దుస్థితి



ఏర్పేడు మండలం పంగూరు- ఊరందూరు రోడ్డు దుస్థితి



ఏర్పేడు: బందారుపల్లిలో రోడ్డు దుస్థితి



బురదగుంటలు కాదు రోడ్లే

ఏర్పేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు ఛిద్రమై అడుగు అడుగునా గోతులమయంగా మారాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదగుంటలను తలపిస్తున్నాయి. బాబొస్తే సింగపూర్ రోడ్లు నిర్మిస్తామన్న మాటలు గాలి మూటలయ్యాయి. దీంతో రహదారులు నరకానికి ద్వారాలుగా మారాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ రోడ్లు దుర్భరంగా మారాయి. ఏర్పేడు మండలం మర్రిమంద, వికృతమాల, చెల్లూరు, బండారుపల్లి, ముసలిపేడు, సరస్వతికండ్రిగ, పంగూరు-ఊరందూరు మార్గం, పాగాలి, మన్నసముద్రం, పాతవీరాపురం, గుడిమల్లం తదితర గ్రామాల్లో రహదారులు గోతులమయంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేణిగుంట మండలం అన్నాసామిపల్లి, విప్పమానుపట్టెడ, కొత్రమంగళం, కరకంబాడి తారకరామానగర్, సుబ్బయ్యగుంట రోడ్లు గోతులమయంగా మారాయి. రేణిగుంట, గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోనూ రోడ్లు దుస్థితికి చేరాయి. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు, వేడాం, రామలింగాపురం, దొమ్మరపాళెం, వేలవేడు, గొల్లపల్లి, కలవగుంట, మేలచ్చూరు గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తొట్టంబేడు మండలం కాసరం, పూడి, చియ్యావరం, విరూపాక్షపురం, కనపర్తి, కంచనపల్లి తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. రహదారుల మరమ్మతుల పేరిట ఆర్ అండ్‌బీ అధికారులు పనులు చేపట్టకుండానే నిధులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి.

మన్నసముద్రంలో దారుణంగా రోడ్లు

ఏర్పేడు మండలం మన్నసముద్రం శివారున బండారుపల్లికి వెళ్లే మార్గంలో భారీ లోడ్డుతో కూడిన లారీలు, టిప్పర్లు వెళుతుండడంతో రోడ్డు పెద్ద పెద్ద గోతులుగా ఏర్పడి అటువైపు వెళ్లే వాహనదారులకు నరకం చూపుతోంది. హైవేలో టోల్‌గేటు ఉండడంతో కొందరు లారీలు మన్నసముద్రం నుంచి కోబాక మీదుగా ఏర్పేడుకు చేరుకుని టోల్‌ఫీజు కట్టకుండా తప్పించుకునేందుకు ఈ మార్గంలో వస్తుండటం, రాత్రి వేళల్లో ఇసుక మాఫియా టిప్పర్ల వల్ల రోడ్డు ఇలా ఛిద్రమైనట్లు స్థానికులు చెబుతున్నారు.

అధ్వాన్నం.. ఆ రోడ్డు మార్గం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం–టీపీ కోట రోడ్డు మార్గం ప్రయాణం ఆ ప్రాంత ప్రజలకు నరకయాతనగా మారింది. 19 కి.మీ.దూరం ఆర్ అండ్ బీ రోడ్డు మార్గం పూర్తిగా ఆనవాళ్లు సైతం చెరిగిపోయాయి. రోడ్డు మార్గం పూర్తిగా బావులను తలపించే గుంతలు ఉండడంతో సుమారు 20 గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ మార్గంలో కార్లు, ఇతర చిన్నపాటి వాహనాలు వెళితే గురవడం ఖాయం. అంతేకాక బస్సులు, ఇతర భారీ వాహనాలు సైతం అప్పుడప్పుడు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల్లో కనీసం చలనం లేదంటూ స్థానిక గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.



ఏర్పేడు: చెల్లూరు రోడ్డు దుస్థితి



ఏర్పేడు: ఇసుక అక్రమ రవాణా కారణంగా ఛిద్రమైన చెన్నంపల్లి రోడ్డు



శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడు రోడ్డు దుస్థితి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



సిద్ధేశ్ యాదవ్‌ను సన్మానిస్తున్న మండల కన్వీనరు మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన గాజులపెళ్లూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్ధేశ్ యాదవ్‌తో పాటు గ్రామ నాయకులను ఘనంగా సన్మానించారు. మణి నాయుడు మాట్లాడుతూ గ్రామంలోని నాయకులను, కార్యకర్తలందరినీ కలుపుకుని, వారి సహకారంతో పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై గ్రామ స్థాయి నుంచే పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌యాదవ్, శివయ్యయాదవ్, శ్రీనివాసులు, వీరాఘవులు, వేంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



టపాసుల లైసెన్స్ పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీదేవి, ఎస్ఐ హరిప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బాణసంచా దుకాణాలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వారు ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో తెలుగుగంగ కార్యాలయం ఆవరణలో ఉన్న టపాసుల దుకాణాలను పరిశీలించి, విక్రయదారులతో మాట్లాడారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫైర్ అలారమ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, జర్నలిస్టులు

రేణిగుంట: నూతనంగా ఏర్పాటైన రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో ఆదివారం ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్టీవీ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఏబీఎన్ భాగ్యరాజు తొలి పూజలు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రెస్‌క్లబ్ నాయకులు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర వివిధ పార్టీల మండల నాయకులు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు నేతాజీ, మబ్బు నారాయణరెడ్డి, విజయ్ యాదవ్, రవి, శంకరయ్య, శ్రీకాళహస్తి గిరి, ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సురేంద్ర రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివమూర్తి పాల్గొన్నారు.

కాలువలో పేరుకుపోయిన పూడిక



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న తెలుగుగంగ 9బి ఉపకాలువ

వరదయ్యపాళెం: తెలుగు గంగ ఉపకాలువలో పూడిక తీత పనులు పేరుకుపోవడంతో ఆ కాలువ గుండా నీటి ప్రవాహం కష్టతరంగా మారుతోంది. మండలంలోని చిన్న పాండూరు మీదుగా మాంబట్టుకు వెళ్లే తెలుగుగంగ 9బి ఉపకాలువ పూర్తిగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో కమ్ముకుపోయింది. దీంతో ప్రధాన కాలువ నుంచి రైతుల అవసరాల కోసం ఉపకాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో కాలువ గుండా నీరు సాఫీగా సాగడం లేదు. ఎక్కడికక్కడ కమ్ముకున్న పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు అడ్డు తగులుతున్నాయి. 2004–05 సమయంలో ఈ కాలువను తవ్వారు. ఈ కాలువను తెలుగుగంగ ప్రాజెక్టు కింద నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు కాలువ బాగోగులపై సంబంధిత తెలుగుగంగ అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ కాలువ పరిధిలో వరదయ్యపాళెం మండలం సంబంధించి దాదాపుగా 15 చెరువుల వరకు సాగు నీరు పారుదల కావల్సి ఉంది. రైతులకు ఎంతో అవసరమైన గంగ ఉపకాలువపై నిర్లక్ష్యం చూపడమేమిటని రైతులు ఆ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువ పూర్తిగా పూడికతీత పనులు చేపట్టి అభివృద్ధి చేయాలని, తద్వారా సాఫీగా నీటి పారుదల జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ కాలువపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉపాధి పనులను ఉపయోగించండి

ప్రస్తుత వేసవిలో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి కాలువ ప్రాంతంలో ఉన్న ఆయా గ్రామాల పరిధిలోని కూలీల ద్వారా తెలుగుగంగ ఉపకాలువలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వృథాగా అవసరం లేని చోట పనులు నిర్వహించడం కంటే రైతుల సాగు నీటి అవసరాల కోసం ఎంతో ఉపయోగపడే కాలువ అభివద్ధికి తోడ్పాటునివ్వాలని కోరుతున్నారు. దీనిపై ఉపాధి హామీ అధికారులు స్పందించి పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరుతున్నారు.

కాలేజీలే లేవన్నారు.. పీజీ సీట్లు ఎలా వచ్చాయి?



మీడియాతో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి చిన్నా

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసలు మెడికల్ కళాశాలలే నిర్మించలేదంటూ కూటమి సర్కారు ప్రచారం చేయగా, ఆ కళాశాలలకు కేంద్రం 60 సీట్లు ఎందుకు కేటాయించిందని తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికార ప్రతినిధి చిన్నా ప్రశ్నించారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన 17 వైద్య కళాశాలలు అంతా ప్రచారం కోసమేనని, ఎక్కడా నిర్మాణం జరగలేదని సాకులు చెబుతూ ఆ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కూటమి కుట్రలు చేసిందన్నారు. అయితే నేడు నేషనల్ మెడికల్ కౌన్సిల్ సంబంధిత కళాశాలలకు 60 పీజీ మెడికల్ సీట్లను కేటాయించిందని, మరి కళాశాలలే లేకపోతే నేషనల్ మెడికల్ కౌన్సిల్ సీట్లను ఎలా కేటాయిస్తుందని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వైద్య కళాశాలలను అభివృద్ధి చేస్తే జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందన్న కుట్రతో ఆ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మచిలీపట్నం, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం, ఏలూరు వైద్య కళాశాలలకు 60 పీజీ మెడికల్ సీట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ కేటాయించినట్లు ఆయన వివరించారు. వైద్య కళాశాలలే నిర్మాణం చేపట్టలేదని దుష్ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వానికి ఇది ఒక చెంపపెట్టు అని ఆయన తెలిపారు.

తిరుచానూరు పవిత్రతను కాపాడండి



మాట్లాడుతున్న మునిరామిరెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుచానూరు అమ్మవారి ఆలయంలోని అధికారులు, విజిలెన్స్ సిబ్బంది, తిరుచానూరు పోలీసులు గత కొంతకాలంగా భక్తుల పట్ల చూపుతున్న దురుసు ప్రవర్తన, దాడులు పెరిగాయని, దీన్ని అరికట్టి తిరుచానూరు పవిత్రతను కాపాడాలని హిందూ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మునిరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ జరిగే ఇలాంటి సంఘటనలు ప్రస్తుతం సోషల్ మీడియాలో నిమిషాల్లో ప్రచారం అవుతున్నాయన్నారు. తిరుచానూరు సీఐ వ్యవహారశైలిపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మూడు రోజుల కిందట అమ్మవారి ఆలయంలోని మహిళా జమేదారు ఓ భక్తున్ని చెంపపైన కొట్టి దాడి చేశారన్నారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆమెను ఇతర ప్రాంతానికి బదిలీ చేశారని తెలిపారు. దీనిపై జిల్లా ఎస్పీ స్పందించి చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

టపాసుల విక్రయాలపై ఆర్డీఓ ఆదేశాలు బాధాకరం

తిరుపతి కల్చరల్: దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 17 నుంచి 19వ వరకు మూడు రోజులు మాత్రమే టపాకాయలు విక్రయించాలని తిరుపతి ఆర్డీఓ ఆదేశాలు ఇవ్వడం బాధాకరమని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సంప్రదాయబద్ధంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో నరకచతుర్దశి, దీపావళి వేడుకలను ప్రజలు జరుపుకుంటున్నారని తెలిపారు. పండుగ రోజున టపాకాయలు విక్రయించడానికి వీలు లేకుండా తిరుపతి ఆర్డీఓ ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు. ఆర్డీవో ఇచ్చిన ఆర్డర్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పడకేసిన పారిశుధ్యం



4వ వార్డులో సంచరిస్తున్న పందులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని 4వ వార్డులో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి దోమలు ప్రబలుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ఆ నీటిని తరలించాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నివారణకు ముందస్తుగా నివారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. 4వ వార్డు శాంతి నగర్ వద్ద పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధభరితంగా మారుతోంది. సోషల్ మీడియాలో ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. పురపాలకసంఘ అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మా పొలం కాపాడండి



మాట్లాడుతున్న భూ బాధితుడు పాండురంగ

తిరుపతి కల్చరల్: తమకు జీవనాధారమైన పొలం భూమి తహసీల్దార్‌తో కుమ్మక్కై రికార్డులను మార్పు చేసే భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారుడిపై చర్యలు తీసుకుని తమ పొలం భూమిని రక్షించి తమకు ఇప్పించాలని శ్రీకాళహస్తికి చెందిన భూ బాధితులు పాండురంగ, తల్లి అనసూయమ్మ ప్రభుత్వ అధికారులను వేడుకున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఎస్ కండ్రిగ మండల పరిధిలోని పల్లమాల గ్రామం లెక్క దాఖలాలోని సర్వేనంబర్ 79/3లో 91వ ఖాతా సంఖ్యలోని ఐదు ఎకరాల డీకేటీ భూమిని 2011లో బూదూరు గోవిందమ్మ నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. పేద కుటుంబమైన తాము కాయకష్టం చేసి కూడబెట్టిన సొమ్ముతో ఈ భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నామన్నారు. తమ భూమికి 2019 పాస్ పుస్తకాలు కూడా పొందామన్నారు. అప్పటి నుంచి తమ స్వాధీనంలో ఉందని, ఇప్పుడు ఆ భూమిని కాజేసేందుకు శేఖర్, సుధాకర్, చెంగయ్య అనే వ్యక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. దీనిపై గత నెలలో కోర్టును ఆశ్రయించడంతో కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని తెలిపారు. అయితే తమ పొలానికి సంబంధించిన రికార్డులను శేఖర్ అనే వ్యక్తి తహసీల్దార్‌కు రూ.10లక్షలకుపైగా సొమ్ములిచ్చి తమ భూమి రికార్డులనే మార్చేశారని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను కలిసి జరిగిన విషయం చెప్పినా పట్టించుకోలేదని, అంతేకాక తమనే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు జీవనాధారమైన తమ పొలం భూమి కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకుని తమ భూమిని తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు మంజుల, మౌనిక పాల్గొన్నారు.